




# మనం



## నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం । 18 । అక్టోబర్ । 2026 పేజీలు: 8


# బాన్సువాడ నియోజకవర్గంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



- పలు గ్రామాల్లో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి.

2

బాన్సువాడ, అక్టోబర్ 17 (మనంన్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు బాన్సువాడ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలు, బాన్సువాడ పట్టణంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొని మహిళలతో కలిసి వేడుకల్లో సందడి చేశారు.



## తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

- కలెక్టరేట్లో డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు.
- మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన కలెక్టర్, పోటీల్లో ప్రతిభ చూపిన మహిళా సంఘాలకు బహుమతులు.
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.

2

## విద్యుత్ కోతలపై ప్రభుత్వానికి ముందుచూపేది?

- విద్యుత్ కోతలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శ. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా.
- ఎల్నినో ప్రభావం తెలిసినా ముందస్తు చర్యలు శూన్యం.
- పంటకు సాగునీరు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి: ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి.

2




## పార్టీలకతీతంగా దసరా ఉత్సవాలు



- ఇందిరాగాంధీ స్టేడియంలో వేడుకలకు 25 మందితో కమిటీ ఏర్పాటు.
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ.

3

కామారెడ్డి, అక్టోబరు 17 (మనం న్యూస్): కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా పాల్గొని దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పిలుపునిచ్చారు. కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న దసరా వేడుకలను ఘనంగా జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# బాన్సువాడ నియోజకవర్గంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**– పలు గ్రామాల్లో వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి.**

బాన్సువాడ, అక్టోబర్ 17 (మనంన్యూస్): తెలంగాణ సంస్క ృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు బాన్సువాడ నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలు, బాన్సువాడ పట్టణంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొని మహిళలతో కలిసి వేడుకల్లో సందడి చేశారు.





**పలు గ్రామాల్లో పర్యటన**

తన స్వగ్రామమైన పోచారంతో పాటు పోతంగల్ మండలంలోని కల్లూరు, వర్ని మండలంలోని జలాల్పూర్ గ్రామాల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పోచారం శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అనంతరం బాన్సువాడ పట్టణంలోని పాత బాన్సువాడ, సరస్వతి మందిరంలోని ఫంక్షన్ హాల్, కల్కి చెరువు కట్టపై జరిగిన సంబరాల్లో తన సతీమణి పుష్పతో కలిసి పాల్గొన్నారు.



**ఆటపాటలతో ఆడబిడ్డల సందడి.**

రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయబద్ధంగా పాటలు పాడుతూ, ఆటలాడుతూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. పలు గ్రామాలు, బాన్సువాడ పట్టణంలో పండుగ వాతావరణం నెలకొనగా, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు.



**పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు.**

ఈ కార్యక్రమాల్లో బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి, పోచారం శంభు రెడ్డి, మాజీ రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మమేకమైన జీవన విధానానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా జరుపుకున్నారు.

# విద్యుత్ కోతలపై ప్రభుత్వానికి ముందుచూపేది?: ఎమ్మెల్యే కాటిపల్లి

**– విద్యుత్ కోతలకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విమర్శ. బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ధర్నా.**

**– ఎల్నినో ప్రభావం తెలిసినా ముందస్తు చర్యలు శూన్యం.**

**– పంటకు సాగునీరు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి: ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి.**




కామారెడ్డి, అక్టోబరు 17 (మనం న్యూస్): ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడంతోనే రైతులు విద్యుత్ కోతల సమస్యను ఎదుర్కొంటున్నారని కామారెడ్డి ఎమ్మెల్యే, బీజేఎల్పీ ఉపనేత కాటిపల్లి వెంకటరమణారెడ్డి విమర్శించారు. ఎల్నినో ప్రభావంతో సమస్యలు తలెత్తే అవకాశముందని ఆరు నెలల ముందే తెలిసినా ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. రైతులకు కోతలు లేని నాణ్యమైన విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. రైతుల విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శనివారం కామారెడ్డి సబ్ డివిజన్ విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి పాల్గొని మాట్లాడారు.

**యాసంగికి ఇప్పుడే ప్రణాళిక రూపొందించాలి**

గత ప్రభుత్వాన్ని కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో విమర్శించడంపై రేవంత్రెడ్డి ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ రైతుల సమస్యల పరిష్కారంపై లేదని విమర్శించారు. ప్రస్తుత పంటకు తప్పనిసరిగా సాగునీరు అందించాలని, రానున్న యాసంగి పంట సాగుకు అవసరమైన నీటి లభ్యత, విద్యుత్ సరఫరాపై ఇప్పటి నుంచే ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు. సాగునీటి విషయంలో ముందస్తు ప్రణాళిక లేకపోతే భవిష్యత్తులో తాగునీటి అవసరాలకూ ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని కోరారు. అనంతరం విద్యుత్ శాఖ ఎస్ఈ సాలియా నాయక్కు బీజేపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

# తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ

**– కలెక్టరేట్లో డీఆర్డీఏ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు.**

**– మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన కలెక్టర్, పోటీల్లో ప్రతిభ చూపిన మహిళా సంఘాలకు బహుమతులు.**

**– తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాలి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్.**

కామారెడ్డి, అక్టోబరు 17 (మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వైభవాన్ని కాపాడుతూ భావితరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. జిల్లా కలెక్టరేట్లో శనివారం డీఆర్డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు సంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరితంగా జరిగాయి. మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూల బతుకమ్మలతో సందడి చేశారు.

ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జ్యోతి ప్రజ్వలన చేసి, కొబ్బరికాయ కొట్టి బతుకమ్మ ఆటలను ప్రారంభించారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే ఈ పండుగకు రాష్ట్ర సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఇలాంటి వేడుకలు మహిళల్లో ఐక్యతను, పరస్పర స్నేహభావాన్ని పెంపొందించడంతోపాటు సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడతాయని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు.

బతుకమ్మ పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళా సంఘాలకు కలెక్టర్ జ్ఞాపికలు అందజేశారు. ప్రథమ, ద్వితీయ బహుమతులు సాధించిన బతుకమ్మల రూపకర్తలను అభినందించి బహుమతులు ప్రదానం చేశారు.



కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎన్.వై. గిరి, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, డీఆర్డీఏ అధికారి దామోదర్ రెడ్డి, అదనపు డీఆర్డీఏ అధికారి విజయలక్ష్మి, వెంకటేష్, టీజీవో అధ్యక్షుడు దేవేందర్, కార్యదర్శి సాయిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా దసరా ఉత్సవాలు: షబ్బీర్ అలీ

- ఇందిరాగాంధీ స్టేడియంలో వేడుకలకు 25 మందితో కమిటీ ఏర్పాటు.
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు: ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ.






కామారెడ్డి, అక్టోబరు 17 (మనం న్యూస్): కులమతాలకు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రజలందరూ ఐక్యంగా పాల్గొని దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ పిలుపునిచ్చారు. కామారెడ్డి పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించనున్న దసరా వేడుకలను ఘనంగా జరిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల నిర్వహణ కోసం 25 మందితో కమిటీని నియమించినట్లు శనివారం స్టేడియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈ సందర్భంగా ఉత్సవాల ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించి, నిర్వహణకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులకు ప్రత్యేకంగా ఆహ్వాన పత్రికలు పంపించి వేడుకలకు ఆహ్వానించనున్నట్లు చెప్పారు. ప్రజలందరూ ఉత్సవాల్లో భాగస్వాములై పండుగను ఐక్యతకు ప్రతీకగా నిర్వహించుకోవాలని కోరారు.

**అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు**

దసరా వేడుకలకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని షబ్బీర్ అలీ అధికారులను ఆదేశించారు. మున్సిపల్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, క్రీడలు, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్, ట్రాఫిక్ తదితర శాఖల అధికారులతో ఏర్పాట్లపై సమీక్షించారు. ఆయా శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు.

**ప్రజా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి**

ఉత్సవాలకు వచ్చే ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించడంతోపాటు భద్రత, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజల అవసరాల కోసం పబ్లిక్ టాయిలెట్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అవసరమైన సమాచారం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయనున్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**అందరూ భాగస్వాములు కావాలి**

కామారెడ్డి పట్టణంలో దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు సహకరించాలని షబ్బీర్ అలీ కోరారు. కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

---

# విద్యాశాఖ కార్యాలయానికి సమాచార హక్కు దరఖాస్తు

- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పూర్తి వివరాలు కోరిన మీర్జాపురం రామకృష్ణ



బోధన్, అక్టోబర్ 17 (మనం న్యూస్): బోధన్ మండలంలోని విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడమే లక్ష్యంగా సామాజిక కార్యకర్త, మీర్జాపురం రామకృష్ణ సమాచార హక్కు చట్టం కింద మండల విద్యాశాఖ అధికారి కార్యాలయానికి దరఖాస్తు సమర్పించారు.

**17 అంశాలపై సమాచారం కోరిన దరఖాస్తుదారుడు.**

మండల విద్యాశాఖ అధికారి కార్యాలయానికి సంబంధించిన ఆర్టీఐ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం 17 అంశాలకు సంబంధించిన సమాచారంతో పాటు, బోధన్ మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పూర్తి వివరాలను అందించాలని ఆయన కోరారు.

**పాఠశాలల వివరాలు వెల్లడించాలని దరఖాస్తు.**

మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు ప్రైవేట్ పాఠశాలల వివరాలు, పాఠశాల కోడ్లు, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్ల పేర్లు, మొబైల్ నంబర్లతో సహా సంబంధిత సమాచారాన్ని అందించాలని దరఖాస్తులో పేర్కొన్నారు.

**విద్యాశాఖలో జవాబుదారీతనం పెరగాలి.**

ప్రభుత్వ పాఠశాలల పనితీరు, ప్రైవేట్ పాఠశాలలకు మంజూరైన అనుమతులు, విద్యార్థుల సంఖ్య తదితర వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండటం అవసరమని దరఖాస్తుదారుడు అభిప్రాయపడ్డారు. విద్యా వ్యవస్థకు సంబంధించిన సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంటే పాఠశాలల నిర్వహణపై అవగాహన పెరగడంతో పాటు, విద్యాశాఖ పనితీరుపై ప్రజల్లో నమ్మకం బలపడుతుందని పేర్కొన్నారు.

**సమాచార హక్కుతో పారదర్శక పాలనకు ప్రోత్సాహం.**

సమాచార హక్కు చట్టం ప్రజలకు కల్పించిన హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రభుత్వ శాఖల పనితీరులో పారదర్శకతను పెంపొందించవచ్చని మీర్జాపురం రామకృష్ణ ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు కోరిన సమాచారాన్ని చట్ట నిబంధనల ప్రకారం అందించాలని ఆయన కోరారు.

---

# కాచాపూర్లో బెల్ట్ షాపులను నిర్మూలించాలి

- అక్రమ మద్యం విక్రయాలపై ఎక్సైజ్ అధికారులకు యువకుల ఫిర్యాదు



భిక్కనూర్, అక్టోబర్ 17 ( మనం న్యూస్ ): కాచాపూర్ గ్రామంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను నిర్మూలించి, అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామానికి చెందిన యువకులు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. గ్రామంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, వీటిని అరికట్టి గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని అధికారులను కోరారు. గ్రామంలో అనుమతులు లేని బెల్ట్ షాపులను గుర్తించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యువకుల ఫిర్యాదుపై ఎక్సైజ్ అధికారులు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాచాపూర్ గ్రామానికి చెందిన యువకులు కామినేని సంతోష్ రెడ్డి, మెట్టు సందీప్, ముత్యాల నవీన్ చారి, పూస శంకర్, మద్రి మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

---

# 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేసిన జుక్కల్ ఎమ్మెల్యే





మద్నూర్, అక్టోబర్ 17 మనం న్యూస్ : రైతుల అవసరాలే లక్ష్యంగా 10.30 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేసిన జుక్కల్ శాసన సభ్యులు .జుక్కల్ నియోజకవర్గంలోని బ్రాహ్మణ్పల్లి-ఆరేపల్లి, కాటేపల్లి, లచ్చన్, తడ్గూర్ గ్రామాల్లో మొత్తం 10.30 కోట్ల అంచనా వ్యయంతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు భూమిపూజ చేశారు.రైతులకు వ్యవసాయ అవసరాల కోసం నాణ్యమైన విద్యుత్తు అందించడంతో పాటు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించి, సాగు పనులకు ఇబ్బందులు కలగకుండా చూడటమే ఈ సబ్‌స్టేషన్ల నిర్మాణ ప్రధాన ఉద్దేశం.ఈ పనులను 3-4 నెలల్లో పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఊరెళ్లే ముందు.. ఇంటి భద్రత మరవొద్దు

**– ఊరెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి, ఇంటి భద్రతపై అప్రమత్తంగా ఉండాలి.**

**– ప్రయాణంలో రహదారి నియమాలు పాటించి, హెల్మెట్, సీటు బెల్టు ధరించి వేగ నియంత్రణ పాటించాలి.**

**– అనుమానాస్పద కదలికలు కనిపిస్తే డయల్ 112కు సమాచారం ఇవ్వండి: జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర.**



కామారెడ్డి, అక్టోబరు 17 (మనం న్యూస్): దసరా పండుగ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే ప్రజలు ఇళ్ల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర సూచించారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే దొంగతనాలకు ఆస్కారం ఉంటుందని హెచ్చరించారు. ఊరికి వెళ్లే ముందు స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 112కు తెలియజేయాలని కోరారు. పండుగ ప్రయాణాల్లో రహదారి భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు. దసరా సందర్భంగా ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లే అవకాశమున్నందున దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. దూరప్రాంతాలకు వెళ్లేవారు ముందుగా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. ఇంట్లో బంగారు ఆభరణాలు, నగదు ఉంటే సాధ్యమైనంత వరకు బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని పేర్కొన్నారు. నమ్మకమైన పొరుగువారికి ఇంటి వివరాలు తెలియజేసి, పరిసరాలను గమనించాలని కోరారు.

**సీసీ కెమెరాలను అమర్చుకోవాలి**

ఇళ్లకు నాణ్యమైన తాళాలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. ఇంటి లోపల, బయట అవసరమైన చోట్ల లైట్లు వెలిగేలా చూసుకోవాలన్నారు. వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో నిలిపి హ్యాండిల్ లాక్తోపాటు వీల్ లాక్ కూడా వేయాలని తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని సామాజిక మాధ్యమాల్లో వెల్లడించవద్దని స్పష్టం చేశారు. కాలనీలు, గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 112కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీసుల గస్తీకి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రయాణంలోనూ జాగ్రత్తలు తప్పనిసరి**

పండుగకు ప్రయాణించే సమయంలో రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఎస్పీ సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో వెళ్లేవారు సీటు బెల్టు ధరించాలని తెలిపారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. రాత్రి ప్రయాణాల్లో అప్రమత్తంగా ఉండాలని, అలసటగా ఉన్నప్పుడు వాహనం నడపకుండా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం పోలీసు శాఖ బాధ్యతని పేర్కొంటూ, పండుగను ఆనందంగా జరుపుకుంటూనే భద్రత విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని జిల్లా ప్రజలకు ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# పిఆర్టీయూ -టీ ఎస్ రాష్ట్ర కార్యవర్గంలో రెంజల్ మండలానికి సముచిత స్థానం...

**– నాయకులు గా ఏకగ్రీవ ఎన్నిక.. ఘనంగా అభినందించిన సోమలింగం గౌడ్, శ్రీనివాస్ రెడ్డి...**

రెంజల్, అక్టోబర్ 17(మనం న్యూస్) : నల్గొండ జిల్లాలో శుక్రవారం నిర్వహించిన పిఆర్టీయూ -టీ ఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రెంజల్ మండలానికి చెందిన ఉపాధ్యాయ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల మండల శాఖ హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతలు దక్కడం రెంజల్ మండలానికి గర్వకారణమని పేర్కొంటూ నూతన కార్యవర్గ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపింది.

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఐదుగురు ఎన్నిక.,

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా ఎన్నికైన వారిలో

కే.కృష్ణ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దూపల్లి),

ఎన్.సునీల్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తాడ్బిలోలి),

ఎన్ సాయిబాబా (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నీల),

జి.నాందేవ్ (జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రెంజల్),

బి.శ్రీరామ్ (మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నీల) ఉన్నారు...

అదేవిధంగా టీ.విజయ్ కుమార్ (ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, సటాపూర్ ఫామ్) రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

సోమలింగం గౌడ్, శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అభినందనలు.,



పిఆర్టీయు రెంజల్ మండల శాఖ అధ్యక్షులు టీ.సోమలింగం గౌడ్, ప్రధాన కార్యదర్శి కే. శ్రీనివాస్ రెడ్డి నూతనంగా రాష్ట్ర కార్యవర్గంలో ఎన్నికైన సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం, విద్యారంగ అభివృద్ధికి నూతన కార్యవర్గ సభ్యులు మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

రెంజల్ మండలానికి చెందిన ఉపాధ్యాయ నాయకులకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడం మండల ఉపాధ్యాయులందరికీ ఆనందకరమైన విషయమని, ఈ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ సంఘం అభివృద్ధికి తోడ్పడాలని వారు కోరారు.

**జిల్లా నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు.,**

ఈ ఎన్నికలకు సహకరించిన జిల్లా అధ్యక్షులు అంబెల్లి శంకర్, ప్రధాన కార్యదర్శి గంగోని కిషన్ లకు పిఆర్టీయు రెంజల్ మండల శాఖ తరఫున టీ.సోమలింగం గౌడ్, కే. శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా నాయకత్వం అందించిన సహకారం, ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్రస్థాయిలో రెంజల్ మండలానికి మంచి గుర్తింపు తీసుకొచ్చిన నూతన కార్యవర్గ సభ్యులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని పిఆర్టీయు రెంజల్ మండల శాఖ ఆకాంక్షించింది.

టీ. సోమలింగం గౌడ్ - అధ్యక్షులు
కే . శ్రీనివాస్ రెడ్డి - ప్రధాన కార్యదర్శి
పిఆర్టీయూ -టీఎస్రెంజల్ మండల శాఖ...



# ఎన్హెచ్ఎం ఉద్యోగుల సమ్మెకు ఎమ్మెల్యే కాటిపల్లి మద్దతు

**– ఐదో రోజు ఎన్హెచ్ఎం సమ్మె శిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి.**

**– ఎండలో నాలుగు నెలల పాపతో కూర్చున్న మహిళా ఉద్యోగిని చూసి ఆవేదన.**

**– సమస్యలు పరిష్కారమయ్యే వరకు అండగా ఉంటామని హామీ**

కామారెడ్డి: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్హెచ్ఎం) కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం చేపట్టిన నిరవధిక సమ్మెకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మద్దతు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఐదో రోజు కొనసాగుతున్న సమ్మె శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు. నాలుగు నెలల చంటిపాపను ఎత్తుకుని ఎండలో కూర్చున్న మహిళా ఉద్యోగిని చూసి ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్నప్పటికీ, కనీసం నీడ కోసం టెంట్ వేసుకునేందుకు కూడా అనుమతి ఇవ్వకపోవడం విచారకరమన్నారు. మహిళా ఉద్యోగులు, చిన్నపిల్లలు ఎండలో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి రావడంపై ప్రభుత్వ వైఖరిని విమర్శించారు.

**అండగా ఉంటా.. ఎమ్మెల్యే హామీ**

ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే ఎన్హెచ్ఎం సిబ్బంది సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి ఇబ్బందులను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడం, ‘సమాన పనికి సమాన వేతనం’ సూత్రాన్ని అమలు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యమని ఆరోపించారు. ఎన్హెచ్ఎం ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి తన పూర్తి మద్దతు ఉంటుందని, వారి డిమాండ్లు నెరవేరే వరకు అండగా నిలుస్తానని కాటిపల్లి వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు.

# అధిక వడ్డీలకు అప్పులు.. చిట్టీల పేరుతో వసూళ్లు!

**అనధికారిక ఫైనాన్స్ నిర్వహణపై కేసు నమోదు**

**ప్రామిసరీ నోట్లు, చిట్టీల రిజిస్టర్లు స్వాధీనం.. ఎస్ఐ జె. రామకృష్ణ**

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 17 (మనం న్యూస్): అనుమతులు లేకుండా అధిక వడ్డీలకు అప్పులు ఇవ్వడం, చిట్టీల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలపై సిరికొండ పోలీసులు కేసు నమోదు చేశారు. సిరికొండ గ్రామానికి చెందిన గురుడు శ్రీనివాస్పై ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ జె. రామకృష్ణ తెలిపారు.

ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. గురుడు శ్రీనివాస్ ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు, లైసెన్సులు లేకుండా ప్రజలకు అధిక వడ్డీలకు డబ్బులు అప్పుగా ఇస్తూ, వారి నుంచి ప్రామిసరీ నోట్లు తీసుకుంటున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. అలాగే చిట్టీల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అతని నివాసంలో చట్టపరమైన నిబంధనల ప్రకారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రామిసరీ నోట్లు, చిట్టీల నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లు లభించడంతో సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**అక్రమ ఫైనాన్స్ కార్యకలాపాలపై నిఘా**

సిరికొండ మండల పరిధిలో అనుమతులు లేకుండా ఫైనాన్స్ వ్యాపారం నిర్వహించడం, అధిక వడ్డీలకు అప్పులు ఇవ్వడం, చిట్టీల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేయడం వంటి కార్యకలాపాలపై పోలీసులు నిఘా కొనసాగిస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలు వసూలు చేయడం, రుణగ్రహీతలను బెదిరించడం, వేధించడం వంటి చర్యలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

అనధికారికంగా నిర్వహించే ఫైనాన్స్ సంస్థలు, చిట్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. డబ్బులు పెట్టుబడిగా పెట్టే ముందు సంబంధిత సంస్థల చట్టబద్ధతను పరిశీలించాలని కోరారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం తెలిసిన వారు వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని ఎస్ఐ జె. రామకృష్ణ సూచించారు. ప్రజల ఆర్థిక భద్రతకు భంగం కలిగించే చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



## పెద్ద ఎక్లార గ్రామంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

మద్నూర్, అక్టోబర్ 17 (మనం న్యూస్) : మద్నూర్ మండలం లోని పెద్ద ఎక్లార గ్రామంలో శనివారం రోజున బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను గ్రామ మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో, ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు.

గ్రామ సర్పంచ్ మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలంతా ఒకచోటికి చేరి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ, సాంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలతో సందడి చేశారు.

ఈ సందర్భంగా గ్రామస్తుల ఆనందోత్సాహాల మధ్య గ్రామంలో సంపూర్ణ పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ బతుకమ్మ సంబరాలను ఘనంగా విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సంగ్రామ్ పటేల్, నాయకులు హనుమంతరావు దేశాయ్ మహిళలు చిన్నారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే భూపతి రెడ్డి పరామర్శ

**అనారోగ్యంతో బాధపడుతున్న కాంగ్రెస్ నాయకుడి తండ్రికి పరామర్శ**



నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 17 (మనం న్యూస్): నిజామాబాద్ నగరపాలక సంస్థ పరిధిలోని మూడో డివిజన్ గూపన్పల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి కుటుంబాన్ని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి శనివారం సాయంత్రం పరామర్శించారు. ఇటీవల శ్రీనివాస్ రెడ్డి తండ్రి మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు.

అనంతరం అదే డివిజన్కు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు నరేందర్ రెడ్డి తండ్రి అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సదాసింగ్ తదితరులు పాల్గొన్నారు.



## కమలాపూర్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**పూల పండుగలో ఆటపాటలతో సందడి చేసిన మహిళలు**

నిజామాబాద్ రూరల్ అక్టోబర్ 17 (మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను శనివారం కమలాపూర్ గ్రామంలో మహిళలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో మహిళలు పెద్ద సంఖ్యలో వేడుకల్లో పాల్గొన్నారు.

బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు, ఆటపాటలతో సందడి చేశారు. పూల సౌందర్యంతో గ్రామంలో పండుగ శోభ వెల్లివిరిసింది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మమేకమైన జీవనశైలికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ద్వారా రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే సందేశాన్ని చాటిచెప్పారు. మహిళల ఆనందోత్సాహాల మధ్య కమలాపూర్లో బతుకమ్మ సంబరాలు వైభవంగా సాగాయి.



## పోలీస్ స్టేషన్లో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**మహిళా కానిస్టేబుళ్లతో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఎస్హెచ్ఓ చంద్రశేఖర్ రెడ్డి**




ఆర్మూర్, అక్టోబర్ 17 (మనం న్యూస్): ఆర్మూర్ పోలీస్ స్టేషన్లో ఎస్హెచ్ఓ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుళ్లు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మలను పేర్చి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు.తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పోలీస్ స్టేషన్లో నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహిళా కానిస్టేబుళ్లు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకల్లో పాల్గొని పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు.

## బిచ్కుంద మున్సిపాలిటీ 12వ వార్డులో ఘనంగా బతుకమ్మ వేడుకలు

**బతుకమ్మ పండుగ లో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ సీమ షట్కార్**



బిచ్కుంద అక్టోబర్ 17 (మనం న్యూస్) : బిచ్కుంద మున్సిపాలిటీ 12వ వార్డు శనివారం రోజున బతుకమ్మ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగను మున్సిపల్ చైర్ పర్సన్ సీమ సెట్ కార్ భక్తిశ్రద్ధలతో, ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు.

ఈ వేడుకల్లో మహిళలంతా ఒకచోటికి చేరి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ, సాంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ, నృత్యాలతో సందడి చేశారు.

ఈ సందర్భంగా బిచ్కుంద పట్టణ గ్రామస్తుల ఆనందోత్సాహల మధ్య పట్టణంలో సంపూర్ణ పండుగ వాతావరణం నెలకొంది. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ బతుకమ్మ సంబరాలను ఘనంగా విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ తో పాటు మహిళలు చిన్నారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ ఆర్డీఓ కార్యాలయం వద్ద వికలాంగుల ధర్నా

**ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి**

**ఈవీఎంలను తొలగించి బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి: ఎన్పీఆర్డీ**




బోధన్, అక్టోబర్ 17 (మనం న్యూస్): వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్పీఆర్డీ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్ పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పరిపాలన అధికారికి అందజేశారు.

**ఎన్నికల కమిషనర్ రాజీనామా చేయాలి**

ఈ సందర్భంగా ఎన్పీఆర్డీ నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏశాల గంగాధర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్ నియామక విధానంలో గతంలో ఉన్న పద్ధతిని మార్చడం ప్రజాస్వామ్యానికి విఘాతమని ఆయన విమర్శించారు. ఎన్నికల కమిషనర్ తప్పులకు బాధ్యత వహించేలా చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉండాలని పేర్కొన్నారు.

**ప్రతిపక్షాల ఉద్యమాన్ని అణచివేయొద్దు**

దేశవ్యాప్తంగా యువత, అఖిలపక్ష పార్టీలు ఢిల్లీలో గత నెల రోజులుగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుండా పోలీసుల ద్వారా ఉద్యమాలను అణచివేయాలని ప్రయత్నిస్తోందని గంగాధర్ ఆరోపించారు. ఇది సరైన పద్ధతి కాదని, ప్రజాస్వామ్యబద్ధంగా సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

**బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి**

ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎంల) స్థానంలో బ్యాలెట్ పత్రాల ద్వారా ఎన్నికలు నిర్వహించాలని ఎన్పీఆర్డీ నాయకులు డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను తొలగించి, అధికార పార్టీకి అనుకూలమైన ఓట్లను కొనసాగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని గంగాధర్ ఆరోపించారు. ఈ అంశంపై ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమం**

ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు దేశవ్యాప్తంగా ఆందోళనలు, పోరాటాలు కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ ధర్నా కార్యక్రమంలో ఎన్పీఆర్డీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు గైని రాములు, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ నజీర్, జిల్లా నాయకులు లక్ష్మణ్ సింగాడి, సిరిగిరి దేవదాస్, బీరుగొండ, కన్నా నాగనాథ్ పటేల్, సిందే గంగాధర్, రియాజుద్దీన్, సంటోల జయరాం, సోనీ, లక్ష్మి, కట్టమీద గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



## గోపన్పల్లిలో రూ.55.55 లక్షల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మి అమ్మవారి అలంకరణ

**శ్రీ గౌరి జ్ఞాన ప్రసన్నాంబ భవాని మండపంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు**



బిచ్కుంద అక్టోబర్ 17 ( మనం న్యూస్): కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలంలోని గోపన్పల్లి గ్రామంలో శ్రీశ్రీ గౌరి జ్ఞాన ప్రసన్నాంబ భవాని మండపంలో మహాలక్ష్మి అమ్మవారిని రూ.55,55,555 విలువైన కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. మహాలక్ష్మి దేవి అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అత్యంత భక్తిశ్రద్ధలతో చేపట్టిన ఈ ప్రత్యేక అలంకరణలో భాగంగా అమ్మవారిని వివిధ కరెన్సీ నోట్లతో అందంగా అలంకరించారు. ఈ విశేష అలంకరణను దర్శించుకునేందుకు గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మహాలక్ష్మి అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం కలగాలని భక్తులు ప్రార్థిస్తున్నారు.

## అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు!

**ఉత్సాహంగా పాల్గొన్న సర్పంచులు.**



సదాశివనగర్, అక్టోబర్ 17(మనం న్యూస్): 'సందడిగా డాన్స్ చేసిన కార్యదర్శులు. సదాశివనగర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు ఎంపీడీఓ సంతోష్ కుమార్ అతిథిగా హాజరై సందడి చేశారు.తెలంగాణ ప్రకృతి అందాలు,ఆచార సంప్రదాయాలు ఉట్టిపడేలా వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి,సంప్రదాయ దుస్తుల్లో మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆటపాటలతో వేడుకలను జరుపుకున్నారు.సంప్రదాయ పాటలు,కోలాటాలు,ఆటపాటలతో గ్రామ సర్పంచులు,పంచాయతీ కార్యదర్శుల సందడి మధ్య వేడుకలు అంబరాన్నంటాయి.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు,సర్పంచులు,కార్యదర్శుల కుటుంబాల మధ్య ఆత్మీయత,ఐక్యతను పెంపొందించేలా ఈ వేడుకలు నిర్వహించారు.అందరు ఒకచోట చేరి ఆనందోత్సాహాలతో బతుకమ్మ పండుగను జరుపుకోవడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో సర్పంచులు,మండల స్థాయి అధికారులు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## భిక్కనూర్ మండలంలో ఈ నెల 22 నుంచి కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం

**ప్రతిరోజూ 20 ఇళ్లను సందర్శించనున్న ఆశా కార్యకర్తలు**



భిక్కనూర్, అక్టోబర్ 17 ( మనం న్యూస్ ): భిక్కనూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 22వ తేదీ నుంచి నవంబర్ 4వ తేదీ వరకు కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం (ఎల్సీడీసీ) నిర్వహించనున్నట్లు భిక్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ యమీమా తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు ప్రతిరోజూ 20 ఇళ్లను సందర్శించి, చర్మంపై అనుమానాస్పద మచ్చలు ఉన్నవారిని గుర్తించనున్నట్లు పేర్కొన్నారు.

గుర్తించిన వారిని తదుపరి పరీక్షలు అవసరమైన వైద్య సేవల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సూచించారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి సకాలంలో చికిత్స అందించడం ద్వారా వ్యాధి తీవ్రతను నివారించవచ్చని తెలిపారు. ప్రజలు ఆరోగ్య సిబ్బందికి సహకరించి, అనుమానాస్పద మచ్చలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మండలంలోని ఆశా కార్యకర్తలతో పాటు పీహెచ్ఎన్ జానకి, సూపర్వైజర్లు సువర్ణ, రాజమణి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబరాలు

కార్యక్రమంతో పాటు భిక్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని పండుగ వాతావరణాన్ని నెలకొల్పారు.

## శ్రీ మహాలక్ష్మి అలంకారంలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు

**- ఏడో రోజు వైభవంగా దుర్గామాత ఉత్సవాలు.**

**- పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్.**



కామారెడ్డి, అక్టోబరు 17 (మనం న్యూస్): కామారెడ్డి పట్టణ కేంద్రంలోని వైద్యనాథ్ కాలనీలో శ్రీ సింహాసనేశ్వరి దుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం అమ్మవారిని శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో దర్శనమిచ్చేలా అలంకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. కాలనీవాసులంతా ఐక్యంగా, భక్తిశ్రద్ధలతో అమ్మవారి పూజల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని ఉమారాణి శ్రీనివాస్ తెలిపారు. ఉత్సవాలు భక్తి వాతావరణంలో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సింహాసనేశ్వరి దుర్గామాత ఉత్సవ సమితి సభ్యులు సుధీర్రెడ్డి, కృష్ణారెడ్డి, విష్ణు, లక్ష్మణ్, నాగరాజుతోపాటు కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.



# విద్యుత్ సమస్యలపై గులాబీ పార్టీ ఫైర్

మద్నూర్ ,అక్టోబర్ 17 (మనం- న్యూస్ ):మద్నూర్ మండల విద్యుత్ సమస్యలపై బీ ఆర్ ఎస్ మండల అద్యక్షులు బన్సీ పటేల్ అద్వర్యం లో శనివారం నాడు మీడియా సమావేశం నిర్వహించారు .ఈ సందర్బంగా బన్సీ పటేల్ మాట్లాడుతు మండలంలో, యావత్ తెలంగాణ రాష్ట్రంలో కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియని దౌర్భాగ్య స్థితి నెలకొంది.నాడు మన ప్రియతమ నాయకుడు కేసీఆర్ గారి హయాంలో 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తో వెలిగిపోయిన తెలంగాణను, ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం చీకట్లోకి నెట్టేసింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాజా సమీక్షలో విద్యుత్ అధికారులను సస్పెండ్ చేస్తామని బెదిరిస్తున్నారు. తప్పు అధికారులది కాదు ,మీ ప్రభుత్వ చేతకానితనం, ముందుచూపు లేని పాలన వల్లే ఈరోజు రాష్ట్రంలో పవర్ క్రైసిస్ (విద్యుత్ సంక్షోభం) వచ్చింది.రైతన్నలారా, ప్రజలారా ఆలోచించండి.ఈరోజు కరెంట్ కోతల వల్ల పొలాల్లో మోటార్లు కాలిపోతున్నాయి, చేతికి వచ్చిన పంటలు ఎండిపోతున్నాయి. రైతులు సబ్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు.సరిపోదన్నట్టు వరి సాగు చేయొద్దని ఈ ప్రభుత్వం ఉచిత సలహాలు ఇస్తోంది.మండల బీఆర్ఎస్ అధ్యక్షుడిగా నేను ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.తక్షణమే మా మండల పరిధిలోని రైతులకు, గృహ వినియోగదారులకు 24 గంటల నిరంతర విద్యుత్ అందించాలి.లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ల ముట్టడి, పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని హెచ్చరిస్తున్నాం.అని మద్నూర్ మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు బన్సి పటేల్ మండల పార్టీ నాయకులు కొనియాడారు. ఈ మీడియా సమావేషం లో సీనియర్ నాయకులు కాశీనాథ్ పటేల్,మాజీ సొసైటీ చైర్మన్ పండిత్ రావు పటేల్, మండల మాజీ సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు దారస్ సురేష్ .చిన్న శకర్గ మాజీ సర్పంచ్ గఫర్,షాకపూర్ మాజీ సర్పంచ్ సభ్యులు ఎమ్.కే పటేల్,మండల పార్టీ నాయకులు వెంకట్ కాలే ,రూసేగావ్ గ్రామ ఉప సర్పంచ్ సభ్యులు, మద్నూర్ మండల ఉప సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు మహేష్ , మద్నూర్ మండల యువ నాయకులు వాగుమరే మారుతి ,సబేర్ తదితరులు పాల్గొన్నారు.



# డ్రగ్స్‌కు దూరంగా.. క్రీడలకు దగ్గరగా!

## ‘సే నో టు డ్రగ్స్’ నినాదంతో బీవీఎల్ బంజారా లీగ్-1 ప్రారంభం

## ఐపీఎల్ తరహాలో వాలీబాల్ టోర్నమెంట్.. యువతలో క్రీడాస్ఫూర్తి నింపడమే లక్ష్యం

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 17 (మనం న్యూస్): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలనే లక్ష్యంతో నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని గోప్య తండా, సర్పంచ్ తండా, గడ్డమీద తండా గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బీవీఎల్ ( బి వి ఎల్ ) బంజారా లీగ్-1 వాలీబాల్ టోర్నమెంట్ను ఘనంగా ప్రారంభించారు. ‘సే నో టు డ్రగ్స్’ (డ్రగ్స్కు నో చెప్పండి) నినాదంతో చేపట్టిన ఈ క్రీడా వేడుక యువతలో ఉత్సాహాన్ని నింపింది.

ఈ కార్యక్రమానికి ఇందల్వాయి రేంజ్ ఆఫీసర్ రావి మోహన్ భట్, బహుజన టీచర్స్ ఫెడరేషన్ (బీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. సంతోష్ నాయక్, సెక్షన్ ఆఫీసర్ భాస్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.







### క్రీడలతోనే ఆరోగ్యకరమైన సమాజం

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, ఐక్యత, పట్టుదల, నాయకత్వ లక్షణాలను అలవర్చుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు తగిన వేదిక కల్పించడంతో పాటు, యువతను ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు నడిపించడమే బంజారా లీగ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

ఐపీఎల్ తరహాలో నిర్వహిస్తున్న ఈ వాలీబాల్ టోర్నమెంట్ ద్వారా తండాల క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభించనుంది. మ్యాచ్లను యూట్యూబ్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తుండటంతో వివిధ ప్రాంతాల్లోని క్రీడాభిమానులు కూడా వీక్షించే అవకాశం కల్పించారు.

### పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

ఈ కార్యక్రమంలో గోప్య తండా సర్పంచ్ మంజుల సంతోష్, సర్పంచ్ తండా సర్పంచ్ శోభ జీవన్ నాయక్, గడ్డమీద తండా సర్పంచ్ కేతావత్ రామ్ సింగ్, మెట్టుమరి తండా సర్పంచ్ కె. తిరుపతి, సంత్ సేవాలాల్ అధ్యక్షుడు జి. రవి, మాజీ అధ్యక్షుడు రాములు, వీడీసీ చైర్మన్లు బన్నాజీ, మాజీ సర్పంచులు సరియా, రాంచందర్, ఎస్టీ బీజేపీ మోర్చా ఉపాధ్యక్షుడు దేశ్యా నాయక్, ఉపసర్పంచులు రామ్ చందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే తండా నాయకులు లింబ నాయక్, శివరాం, వినోద్, రాంచందర్, కిషన్, లాలూ, అంబర్ లాల్, మోహన్తో పాటు వివిధ తండాలకు చెందిన నాయకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై టోర్నమెంట్ ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేశారు.

డ్రగ్స్కు నో చెప్పండి.. క్రీడలను ప్రోత్సహించండి అనే సందేశంతో ప్రారంభమైన బీవీఎల్ బంజారా లీగ్-1 గ్రామీణ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించే దిశగా ముందడుగుగా నిలిచింది.

# బంజపల్లిలో ఘనంగా అమ్మవారి కుంకుమార్చన పూజలు

## మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ.. భక్తిశ్రద్ధలతో పూజలు

నిజాంసాగర్,అక్టోబర్ 17 (మనం న్యూస్) బంజపల్లి గ్రామపంచాయతీలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జై భవాని దుర్గామండలి ఆధ్వర్యంలో మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ఘనంగా కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన చేశారు.

ఈ సందర్భంగా పురోహితులు శంభు శర్మ మాట్లాడుతూ.. కుంకుమార్చన పూజలు మహిళల సౌభాగ్యం, కుటుంబ సుఖసంతోషాలు కలగాలని కోరుతూ నిర్వహించే పవిత్రమైన పూజలని తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.కుంకుమార్చన పూజలతో బంజపల్లి గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో భవాని మాలాదారులు మరియు మహిళలు,గ్రామస్తులు పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.





# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

## రైతులకు ధాన్యం విక్రయంలో ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

## రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ₹అచ్చంపేట ౖఅఇఖి చైర్మన్ పట్లోళ్ల జనార్దన్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ప్రారంభమైన ధాన్యం కొనుగోలు సెంటర్లు

నిజాంసాగర్, సెప్టెంబర్ 17 (మనం న్యూస్ ): నిజాంసాగర్ మండలం పరిధిలోని నర్సింగ్రావుపల్లి, మర్పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కామారెడ్డి జిల్లా ృఇఇ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ప్రారంభించారు.



రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు సౌకర్యాలు కల్పించడం, కొనుగోలు ప్రక్రియను సులభతరం చేయడం లక్ష్యంగా ఈ కేంద్రాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో అచ్చంపేట ౖఅఇఖి చైర్మన్ పట్లోళ్ల జనార్దన్ రెడ్డి , నిజాంసాగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రజా పండరి, ఆయా గ్రామాల సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు, వార్డు సభ్యులు, యువజన కాంగ్రెస్ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పూసల తాండాలో మినీ వాటర్ ట్యాంకు ప్రారంభం

## గ్రామస్తులకు తాగునీటి సౌకర్యం కల్పించడమే లక్ష్యం

నిజామాబాద్ రూరల్, అక్టోబర్ 17 (మనం న్యూస్): సిరికొండ మండల గడ్కోల్ గ్రామ పరిధిలోని పూసల తాండాలో నూతనంగా ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంకును గ్రామ సర్పంచ్ సాంద్ర లత శంకర్, ఉపసర్పంచ్ రొక్కం సంపత్ రెడ్డి ప్రారంభించారు. పాలకవర్గ సభ్యుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు మినీ వాటర్ ట్యాంకు ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పాలకవర్గ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





## రుద్రూర్‌లో దుర్గామాత వద్ద అన్నదానం

రుద్రూర్, అక్టోబర్ 17 (మనం న్యూస్) : దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రుద్రూర్ మండల కేంద్రంలోని దుర్గామాత వద్ద శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 7వ రోజు అమ్మవారు శ్రీ సరస్వతి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మండపం వద్ద అన్నదాత డి. సాయిలు (ఎంఈఓ) భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత మాలధారణ స్వాములు, ఆలయ కమిటీ నిర్వాహకులు, సభ్యులు, మహిళలు, అన్నదాత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## దుర్గాదేవికి కుంకుమార్చన పూజలు

సదాశివనగర్, అక్టోబర్17(మనం న్యూస్): దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఏడవ రోజున శ్రీ మహాలక్ష్మి దేవిగా అమ్మవారు భక్తులకుదర్శనమిచ్చారు. నవరాత్రులో భాగంగా మండలంలోని వజ్జెపల్లి గ్రామంలో దుర్గామాత మండప నిర్వాకులు మహాలక్ష్మి అలంకారం చేసి హిరణ్యాభిషేకం పుష్పాభిషేకం నిర్వహించారు.ఆశ్వీజ సప్తమి దేవి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం మండల వ్యాప్తంగా దుర్గాదేవి మండపాల వద్ద కుంకుమ పూజలు నిర్వహించారు.కుంకుమ పూజలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.అనంతరం అమ్మవారికి మహిళలు పూజలు నిర్వహించారు.మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.



## ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు

సదాశివనగర్, అక్టోబర్17(మనం న్యూస్):సదాశివనగర్ మండలం ఉత్తునూర్ ప్రాథమిక ఆసుపత్రి అభివృద్ధి కోసం సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మెడికల్ ఆఫీసర్ సాయికుమార్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హాస్పిటల్కు వచ్చే రోగుల సంఖ్య పెరిగిందన్నారు.అందుకు అనుగుణంగా అవసరమైన వైద్య పరికరాలు మందులు,వైద్యుల సేవలను నిరంతరం అందుబాటులో ఉంచాలని చెప్పారు.పారిశుధ్యం మెరుగ్గా ఉండాలని అధికారులను ఆదేశించారు.వైద్య సేవల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజయ్య,తాజా మాజీ సొసైటీ చైర్మన్ ప్రభాకర్ రావు,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# దూపల్లి గ్రామంలో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

**సర్పంచ్ దనూరి నర్సవ్వ-అబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు...**

**పూల పండుగలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు...**

**బతుకమ్మ పాటలతో మార్మోగిన గ్రామం!...**



రెంజల్, అక్టోబర్ 17 (మనం న్యూస్): రెంజల్ మండలంలోని దూపల్లి గ్రామంలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామ సర్పంచ్ దనూరి నర్సవ్వ-అబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలవగా, మహిళల ఆనందోత్సాహాల మధ్య గ్రామంలో సంబరాలు అంబరాన్నంటాయి.

**పూల సౌందర్యం.. మహిళల సందడి.. పండుగకు ప్రత్యేక శోభ!.,**

గ్రామంలోని మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ, లయబద్ధంగా అడుగులు వేస్తూ సంబరాలు జరుపుకున్నారు. పూల పరిమళాలు, బతుకమ్మ పాటలు, మహిళల కోలాహలంతో దూపల్లి గ్రామం పండుగ శోభను సంతరించుకుంది.

**తెలంగాణ సంస్కృతికి ప్రతీక.. బతుకమ్మ పండుగ!.,**

తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామ మహిళలు భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా జరుపుకున్నారు. తరతరాలుగా వస్తున్న సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుతూ, భావితరాలకు మన సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పేలా వేడుకలు నిర్వహించారు.

**గ్రామ ఐక్యతకు ప్రతీకగా బతుకమ్మ సంబరాలు!.,**

సర్పంచ్ దనూరి నర్సవ్వ-అబ్బయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలు గ్రామంలో ఐక్యతను, సోదరభావాన్ని చాటిచెప్పాయి. మహిళలు, చిన్నారుల ఉత్సాహంతో బతుకమ్మ సంబరాలు మరింత కళకళలాడాయి. సంప్రదాయ పండుగలను ఘనంగా నిర్వహించడం ద్వారా గ్రామంలో సాంస్కృతిక చైతన్యాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

దూపల్లిలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా సాగడంతో గ్రామమంతా పండుగ సందడి నెలకొంది. పూల పండుగలో మహిళల ఉత్సాహం, సంప్రదాయాల పట్ల వారి మమకారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

బిచ్కుంద అక్టోబర్ 17 (మనం న్యూస్): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బిచ్కుంద మున్సిపాలిటీ కేంద్రంలోని 9వ వార్డులో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో జుక్కల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో సంప్రదాయబద్ధంగా వేడుకలను నిర్వహించారు. మహిళల ఆటపాటలు, బతుకమ్మ పాటలతో ఆ ప్రాంతమంతా పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి ఆరాధనకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే గొప్ప వేడుక అని ఈ సందర్భంగా పేర్కొనడం జరిగింది.

ఈ బతుకమ్మ వేడుకల్లో పాల్గొని మహిళలతో కలిసి పండుగ సంబరాల్లో భాగస్వాములైన మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేకి స్థానికులు, మహిళలు సాదర స్వాగతం పలికారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు చిరకాలం వర్ధిల్లాలని, ప్రతి ఆడపడుచు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

## పలు అభివృద్ధి పనులను పరిశీలించిన నాయకులు

**నిజాంసాగర్ ప్రాజెక్టు వద్ద ఎకో టూరిజం అభివృద్ధి పనుల పరిశీలన**

**రూ.10 కోట్ల అంచనా వ్యయంతో 14 ఎకరాల విస్తీర్ణంలో గోల్ బంగ్లా పరిసరాల్లో ఎకో టూరిజం కాటేజీల నిర్మాణ**



నిజాంసాగర్, అక్టోబర్ 17 (మనం న్యూస్): నిజాంసాగర్ మండలంలోని ,నిజాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని అచ్చంపేట్ గ్రామపంచాయతీ పరిధిలో గల గోల్ బంగ్లా పరిసరాల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎకో టూరిజం కాటేజీల అభివృద్ధి పనులను జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు, కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (ృఇఇ) అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ పరిశీలించారు.నిజాంసాగర్ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో సుమారు 14 ఎకరాల విస్తీర్ణంలో, రూ.10 కోట్ల అంచనా వ్యయంతో ఈ ఎకో టూరిజం ప్రాజెక్టును చేపట్టారు.మరియు అచ్చంపేట గ్రామపంచాయతీలో నిర్మిస్తున్న నూతన కల్వర్టు పనులు పరిశీలించి పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు.

ఈ అభివృద్ధి పనులు పూర్తయితే నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రాంతానికి పర్యాటక ఆకర్షణ మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రకృతి అందాలను ఆస్వాదించేందుకు వచ్చే పర్యాటకులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రావడంతో పాటు, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగేందుకు కూడా దోహదపడే అవకాశం ఉంది.ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు , కామారెడ్డి జిల్లా ృఇఇ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించి, ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు.